# దుఃఖమయ ప్రపంచము

తుమ్మలపల్లి వేంకటసీతారామారావుగారు (సాహిత్యమండలి)

'బాబూ! చాలాపొద్దుపోయింది. నిద్దరపట్టించుకో' అన్నదిశాంత. 'నిద్దుర రావటంలేదే, అమ్మా!' అన్నాడు మంచముమీదపండుకొని బాబు. 'కళ్లుమూసికొని మాట్లాడకుండాపడుకో అదేనిద్రపడుతుంది.' బాబు కళ్లుమూసుకొన్నాడు. ఉలిక్కిపడి 'అమ్మా! ఎవరేవచ్చింది?' 'ఎవరూ రాలేదు. నువ్వు నిద్రపోదు.' 'అమ్మా! ఎందుకుఏడుస్తావు? నీకుభయంవేస్తూన్నదా?' 'లేదు. బాబూ! నువ్వు కండ్లుమూసుకొని పడుకోవాలి, లేకపోతే జ్వరంతగ్గదు.' 'నాన్నగారు ఏరే డాక్టరునుపిలవడానికి?' శాంతహృదయం తరుక్కుపోయింది. కంటినుండినీరు జొటజొట ప్రవహిస్తూయున్నది. గతభర్తృకఅగు శాంత పుత్రుణ్ణి ఊరడించలేకపోయింది. కొంచెముసేపటికి ధైర్యము తెచ్చుకొని 'మామయ్య వెళ్లేడు డాక్టరుకోసం' అని జవాబుచెప్పింది.

'మామయ్య ఎప్పుడు వచ్చేడే?' అన్నాడు బాబు. 'నిన్నరాగానే నిన్ను పలకరించలేదు? అప్పుడే మరచిపోయినావు?' 'లేదులే! నేను ఎక్కడికన్న వెళ్లి క్రొత్తఊళ్లు చూడాలి.' 'జ్వరం నయంకాగానే మామయ్యగారి ఊరు వెళుదువు గానిలే.' 'మామయ్యగారి ఊరువెళ్లను. అదంతా నేనుచూచేను. నాకు అక్కడ బాగుండదు.' 'మరి యింకెక్కడికి వెళతావు?' 'నేను చెప్పను. చెప్పితే నువ్వు కూడావస్తానంటావు.' 'నేనురాను. చెప్పు!' 'నేనువెళ్లేక నీకుఉత్తరం వ్రాస్తాను.'

శాంత దృష్టిఅంతా బాబుమీదనే ఉన్నది. అతడి ఒళ్లంతా ముచ్చెమటలుపోసినవి. దుర్గుణములు అధికమైనవి. ఇక లాభములేదని డాక్టరు వీధిలోనుంచే వెళ్లిపోయినాడు. వేంకటరావు గ్రుడ్లల్లో నీరు కుక్కుకొంటూ చెల్లెలి దగ్గరకువచ్చేడు. 'డాక్టరు ఏడీరా? అన్నయ్యా!' అన్నదిశాంత. 'వస్తున్నాడు' అని విచారంతో బదులుచెప్పేడు.

శాంత రోగి ముఖవికాసాన్ని క్షణక్షణము ఆత్రముతో పరిశీలిస్తూంది. బాబుముఖమండలంలో ఒకచిరునవ్వు మెఱసింది. నవ్వుతూ గదంతా ఒక్కమారు కలియచూశాడు బాబు. శాంత దైన్యముతో అతనివంక తేరిపారచూస్తూన్నది. తనగుండెలమీదఉన్న ఆమెచేతిని తనశిరోభాగాన అలంకరించేడు. బాబు చిరునవ్వుతో 'అమ్మా! నేనువెళతాను' అని కండ్లుమూసుకొన్నాడు.

పెద్దనిట్టూర్పుతో శాంత అతని శరీరంమీదవ్రాలి ఆక్రోశించింది. గృహమంతా హాహాకారములతో నిండిపోయింది.